సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



ధర్మగుండం ఓపెన్

వేములవాడ: రాజన్న ధర్మగుండంలోకి ఊట నీరు వస్తుండటంతో మూసివేసిన ఆలయ అధికారులు సోమవారం తాళాలు తొలగించారు. భక్తులు ధర్మగుండంలోనే స్నానాలు చేశారు.



వర్షంలోనూ రాజన్న దర్శనం

వేములవాడ: వినాయక నవరాత్రులు.. ముసురు వర్షాలకు సోమవారం అంతగా భక్తుల రద్దీ కనిపించలేదు. కొందరూ భక్తులు తడుస్తూనే మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
27.0/24.0

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమవుతుంది. తేలికపాటి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రీవెన్స్‌డేతో సత్వర న్యాయం



సిరిసిల్లక్రైం: ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితుల నుంచి 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేరస్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు.

స్కూళ్ల పటిష్టతే ప్రభుత్వ లక్ష్యం



ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రభుత్వ బడుల పటిష్టతే తమ ప్రభుత్వ లక్ష్యమని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం జంగారెడ్డిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం అదనపు తరగతి గది నిర్మాణానికి భూమి పూజ చేసిన సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుత గదికి రూ.4లక్షలు మంజూరు చేశామని, మరిన్ని నిధులు అవసరముంటే మంజూరు చేస్తామని తెలిపారు. హెచ్‌ఎం సత్యం, ఎంపీడీవో శశికళ, నాయకులు రాఘవరెడ్డి, మంద పెద్ద బాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పసుల వెంకటి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆత్మహత్యల నివారణ దినోత్సవం

- జిల్లా వైద్యాధికారి వసంతరావు

సిరిసిల్లటౌన్: జిల్లా వ్యాప్తంగా ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి వసంతరావు, జిల్లా మానసిక వైద్య నిపుణులు బి.ప్రవీణ్ తెలిపారు. ఈమేరకు సోమవారం సంయుక్త పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆత్మహత్యలను అడ్డుకోవడానికి టోల్ ఫ్రీ నంబరు 14416 అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

28న జిల్లా యువజనోత్సవాలు

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: జిల్లా యువజన సర్వీసులు, క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి అజ్మీర రాందాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో 15 నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులు తమకు ప్రావీణ్యం గల రంగాల్లో ప్రతిభ ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా రంగాల్లో నిర్వహించే పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రాష్ట్రస్థాయి ఉత్సవాలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. జానపద సోలో, బృంద నృత్యాలు, జానపద గేయాలు, పద్య రచన, కవితారచన, కథారచన, చిత్రీకరణ, ప్రకటనలు, హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు తదితర అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లు ఈనెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 75692 07411లో సంప్రదించాలని సూచించారు.

వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

- సెస్ సిబ్బంది సర్వే



బోయినపల్లి(చొప్పదండి): వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ అందించేందుకు సెస్ సిబ్బంది జిల్లాలోని మండపాల్లో సర్వే చేస్తున్నారు. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో సెస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో మండపాల నిర్వాహకుల వద్దకు వచ్చి వివరాలు తీసుకుంటున్నారు. మండపం వైశాల్యం, ఎంత ఓల్టేజీ విద్యుత్ అవసరం పడుతుంది వంటి అంశాలు సేకరిస్తున్నారు. సెస్ ఏఈ, గ్రామ హెల్పర్, లైన్‌మెన్ మండపాల నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తీసుకుంటున్నారు. సెస్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డిని ఈ విషయంపై అడగగా... ప్రభుత్వ ఆదేశాల మేరకు సెస్ సిబ్బంది సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ అందించినందుకు ప్రభుత్వం సంస్థకు బిల్లు రీయింబర్స్ చేస్తుందని వివరించారు.

వాహనాల జోరు !

ఇది సిరిసిల్ల పాతబస్టాండు వెలుపల పార్క్ చేసి ఉన్న బైక్‌లు. ఇక్కడ పార్కింగ్ సౌకర్యం లేదు. కానీ వివిధ పనుల కోసం వచ్చే వారు రోడ్డుకు ఇరువైపులా బైక్‌లను నిలుపుతుంటారు. బస్టాండు లోపల కూడా ఇలాగే బైక్‌లు నిలిపి ఉంటాయి. ఇక్కడే కాదు... జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్, మున్సిపల్ ఏరియా, పోలీస్‌స్టేషన్, బ్యాంకులు ఇలా ఎక్కడ చూసినా పార్కింగ్ చేసిన బైక్‌లు దర్శనమిస్తాయి.



- ప్రతీ నెల 600 వాహనాల రిజిస్ట్రేషన్లు
- అగ్రస్థానంలో బైక్‌లు, రెండో స్థానంలో కార్లు
- జిల్లాలో 1,43,428 వాహనాలు
- బైకులు 99,210, కార్లు 12,762
- మూడో స్థానంలో ట్రాక్టర్లు 9,567
- రిజిస్ట్రేషన్ లేని ఎలక్ట్రికల్ బైక్‌లు మరెన్నో.

సిరిసిల్ల: జిల్లా రోడ్లపై వాహనాల రయ్..రయ్‌మంటూ వెళ్తున్నాయి. పట్టణాలే కాదు పల్లెరోడ్లు సైతం బిజీగా మారాయి. పల్లెల్లో ఇంటికో బైక్.. వాడకో కారు చొప్పున కనిపిస్తున్నాయి. పట్టణాల్లో అయితే ఇంటికో కారు దర్శనమిస్తున్నాయి. ఇటీవల వాహనాల కొనుగోలు మరింత పెరిగింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1,43,428 వాహనాలు ఉన్నాయి. ఇందులో బైకులు 99,210 ఉండడం విశేషం. జిల్లాలోని మొత్తం వాహనాల్లో 69.17 శాతం వాటా బైక్‌లదే. వ్యవసాయం నుంచి ఉద్యోగం చేసే వారి దాకా అందరికీ బైక్ అనివార్యమైంది. పదేళ్ల క్రితం 2014లో అప్పటి సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ (ఇప్పటి రాజన్న సిరిసిల్ల జిల్లా మొత్తం)లో అన్ని వాహనాలు కలిపి 33,806 ఉండేవి. అంటే పదేళ్లలో నాలుగు రెట్లు వాహనాలు పెరిగాయి.

ఎలక్ట్రానిక్ బైక్‌ల పరుగులు

ఎలక్ట్రానిక్ బైకులతో పర్యావరణానికి మేలు జరుగుతుంది. పెట్రోల్, డీజిల్ వినియోగించకపోవడంతో పొగ రాదు. పర్యావరణానికి ముప్పు లేకుండా ముందుకు సాగిపోతోంది. వీటికి మోటారు వాహన ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) వాహన రిజిస్ట్రేషన్ అక్కర లేదు. ఈ బండి నడిపేందుకు ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ అక్కరలేదు. వాహనాల వేగం పరిమితంగా ఉండడంతో ప్రమాదాలు జరగకుండా ఉంటుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ఈ–బైక్స్ డీలర్ షాపులు వెలిశాయి. ఈ–బైక్స్ విక్రయాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ వీటి వినియోగం పెరిగింది. జిల్లాలో రిజిస్ట్రేషన్ కాకుండా ఈ బైక్‌లు వేలల్లో ఉన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే.. భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలం కానుంది.

నెలకు 600 కొత్త వాహనాల రిజిస్ట్రేషన్

జిల్లా వ్యాప్తంగా వాహనాల రిజిస్ట్రేషన్లు సగటున నిత్యం 30 నుంచి 40 వరకు జరుగుతున్నాయి. ఏడాది చివరలో నవంబరు, డిసెంబర్ నెలల్లో రిజిస్ట్రేషన్లు తగ్గుతాయి. కొత్త ఏడాదిలో వాహనాలు కొందామని, రిజిస్ట్రేషన్ చేయిద్దామని వాయిదాలు వేయడంతో వాహనాల రిజిస్ట్రేషన్లు సహజంగానే తగ్గుతుంది. మిగతా రోజుల్లో రిజిస్ట్రేషన్లు బాగానే జరుగుతున్నాయి. నెలకు సగటున 600 వరకు కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. కానీ ఆ స్థాయిలో రోడ్ల విస్తరణ లేక ట్రాఫిక్ పెరిగిపోతుంది. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో వాహనాల రద్దీ ఇబ్బందిగా మారింది. సిరిసిల్ల పెద్దబజారు, వెంకంపేట, మార్కెట్ ఏరియా, గాంధీచౌక్, బ్యాంకు వీధి ప్రాంతాల్లో నిత్యం వాహనాల రద్దీ పెరిగిపోతుంది. వేములవాడ గుడి రోడ్డు నిత్యం రద్దీతోనే కొనసాగుతోంది.

జిల్లాలో వాహనాలు ఇలా..

అంబులెన్స్‌లు :	35
ఆటోలు :	3,591
హార్వెస్టర్లు :	110
కాంట్రాక్ట్ క్యారియర్స్ :	43
విద్యాసంస్థల బస్సులు :	161
గూడ్స్ క్యారియర్స్ :	3,192
మోటారు కార్లు :	12,762
మోటారు సైకిళ్లు (బైక్స్) :	99,210
మోపెడ్స్ :	4,360
మోటారుక్యాబ్స్:	1,155
క్రేన్ వాహనాలు :	08
జేసీబీలు :	233
ట్రాక్టర్లు :	9,567
ఓమ్నీలు :	222
రోడ్ రోలర్లు:	03
జీపులు :	13
త్రీవీలర్స్ గూడ్స్ ఆటోలు :	1,411
దివ్యాంగుల(మూడు చక్రాల) వాహనాలు:	109
లగ్జరీ టూరిస్ట్ క్యాబ్స్ :	16
రిగ్ మౌంటెడ్ (బోరింగ్ బండ్లు) :	06
స్టేజీ క్యారేజెస్ :	130
గూడ్స్ క్యారేజెస్ :	3,192
ఆటోరిక్షాలు :	3,591

మా ఇంట్లోనే ఐదు వాహనాలు



పదేళ్ల కిందట ఇన్ని బండ్లు లేవు. కరోనా లాక్‌డౌన్ తరువాత చాలా మంది వాహనాలు కొనుగోలు చేశారు. మా ఇంట్లోనే రెండు ట్రాక్టర్లు, రెండు బైక్‌లు, ఒక కారు ఉంది. చాలా మంది తమ అవసరాలకు బైక్‌లు, కార్లు కొంటున్నారు. రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలు అధికమయ్యాయి.

– పోటి రాజ్‌కుమార్, ట్రాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు, సిరిసిల్ల

నిత్యం 30 నుంచి 40 రిజిస్ట్రేషన్లు



జిల్లాలో వాహనాల రిజిస్ట్రేషన్లు పని దినాల్లో 30 నుంచి 40 వరకు సాగుతుంటాయి. బైకుల రిజిస్ట్రేషన్లు చాలా ఎక్కువ. ఈ–బైక్స్ విక్రయాల ప్రభావం కూడా ఉంది. సగటున నెలకు 600 వరకు కొత్తబండ్ల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఫ్యాన్సీ నంబర్ల కోసం నిర్దిష్టమైన రుసుం చెల్లించి పొందుతారు. జిల్లాలో ఫ్యాన్సీ నంబర్ల కోసం పోటీ తక్కువే. పదేళ్లలో వాహనాల సంఖ్య బాగా పెరిగింది.

– వి.లక్ష్మణ్, జిల్లా రవాణాశాఖ అధికారి, రాజన్న సిరిసిల్ల

రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు

- శృంగేరి పీఠాధిపతి భారతీస్వామిని కలిసిన ప్రభుత్వ విప్ ఆది



శృంగేరి పీఠాధిపతితో చర్చిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, ఆలయ అధికారులు

వేములవాడ: రాజన్న ఆలయ అభివృద్ధికి అడుగులు శరవేగంగా పడుతున్నాయి. ఇప్పటికే భక్తులకు దర్శనం త్వరగా కల్పించేందుకు బ్రేక్‌దర్శనాన్ని ప్రవేశపెట్టిన ఆలయ అధికారులు, ఆలయ విస్తరణపై కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి సోమవారం శృంగేరిపీఠానికి వెళ్లారు. పీఠాధిపతి విధుశేఖర భారతీ తీర్థస్వామిని కలిసి ఆలయ విస్తరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై సలహాలు తీసుకున్నారు. ఆలయం విస్తరణ నమూనాలతో వెళ్లి, స్వామి వారి సలహాలకు అనుగుణంగా ఆగమశాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపట్టేందుకు చర్చించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానం మేరకు త్వరలోనే రాజన్న ఆలయాన్ని సందర్శించేందుకు వస్తానని భారతీతీర్థ స్వామి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పీఠంలోని శారదాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవాదాయశాఖ స్థపతి శ్రీవల్లీనాయకం, శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు శ్రీరాధాకృష్ణ, రాజన్న ఆలయ ఈఈ రాజేశ్, ఆలయ ప్రధాన అర్చకులు నమలికొండ ఉమేశ్‌శర్మ, చంద్రగిరి శరత్శర్మ, డీఈ రఘునందన్, అసిస్టెంట్ స్థపతి గణేశ్, ఇంజినీర్ అసిస్టెంట్ జి.అంజయ్య ఉన్నారు.

నేతన్నల్లో చిగురించిన ఆశలు

- స్వయం సహాయక సభ్యులకు సర్కారు చీరలు
- ప్రతి ఏడాది ఒక్కొక్కరికి రెండు చీరలు
- బతుకమ్మ చీరల స్థానంలో కొత్త ఆర్డర్లు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో హర్షం

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరల ఆర్డర్లు రావడం లేదని నిరాశలో ఉన్న సిరిసిల్ల నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. బతుకమ్మ చీరల అర్డర్ల స్థానంలో రాష్ట్ర సర్కారు కొత్త నిర్ణయం తీసుకుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల మంది ఉండగా.. ప్రతీ ఏడాది వారికి సర్కారు తరపున ఒక్కొక్కరికి రెండు చీరలు ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నట్లు సీఎం హైదరాబాద్‌లో సోమవారం జరిగిన చేనేత సమావేశంలో ప్రకటించారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఈ ఏడాది లేక సుమారు ఎనిమిది నెలలుగా సిరిసిల్లలో కార్మికులకు పనుల్లేకుండా ఉంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన బతుకమ్మ చీరల ఆర్డర్లకు సంబంధించిన పూర్తి బకాయిలు యజమానులకు రాలేదు. కార్మికులకు 2023కు సంబంధించిన 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులు ఇంకా అందలేదు. ఇన్నాళ్లుగా పనులు లేకుండా ఇబ్బంది పడుతున్న వస్త్రోత్పత్తిదారులు, నేతకార్మికులకు త్వరలోనే పనులు మొదలుకానున్నాయి. బతుకమ్మ చీరలు ఆర్డర్లపై గత ప్రభుత్వంపై ఆరోపణలు వెల్లువెత్తగా కాంగ్రెస్ సర్కారు వాటి స్థానంలో కొత్తగా ఆర్డర్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయం సహాయక సంఘాల సభ్యులైన మహిళలకు ఏడాది రెండు చీరలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. ఈమేరకు మొత్తంగా 1.30కోట్ల చీరల ఆర్డర్లను ఇవ్వాలని సీఎం ప్రకటనతో సిరిసిల్ల నేతన్నల్లో ఆశలు చిగురించాయి. దివాలా దిశగా వెళ్తున్న సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు సీఎం ప్రకటనతో మళ్లీ గత వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తమ వుతుంది. ప్రభుత్వ ఆర్డర్లు పవర్‌లూమ్ పరిశ్రమకు అందిస్తారన్న నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నేతకార్మికులకు పని కల్పించండి



వినతిపత్రం అందిస్తున్న కోడం రమణ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో ఎనిమిది నెలలుగా పనుల్లేకుండా ఉంటున్న నేతకార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ కోరారు. ఈమేరకు సోమవారం రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. గత ప్రభుత్వం నుంచి ప్రారంభానికి నోచుకోని వర్కర్ టు ఓనర్ పథకాన్ని కార్మికులకు అందించాలని కోరారు. నేతకార్మికులకు 2023 సంవత్సరానికి రావాల్సిన బతుకమ్మ చీరలకు సంబంధించిన 10 శాతం యారన్ సబ్సిడీ అందించాలని కోరారు.

కాళోజీ జీవితం స్ఫూర్తి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



నివాళి అర్పిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లకల్చరల్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు సేవలు విశిష్టమైనవి అని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కొనియాడారు. కాళోజీ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కలెక్టరేట్‌లోని క్రీడలశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కాళోజీ జయంతి వేడుకలకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జెడ్పీ సీఈవో వినోద్, డీవైఎస్‌వో రాములు పాల్గొన్నారు. ఎస్పీ ఆఫీస్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ నివాళి అర్పించారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, ఆర్‌ఎస్‌ఐ పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

69 ఏళ్లు.. చందాలు లేని వేడుకలు



వెంకంపేటలోని పురజన సంఘం వినాయక ఉత్సవాల్లో సభ్యులు

సిరిసిల్లటౌన్: వినాయక ఉత్సవాల్లో సిరిసిల్లలోని పురజనసంఘం సభ్యులు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. 69 ఏళ్లుగా వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ.. ఎలాంటి చందాలు వసూలు చేయకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గుడ్ల శంకరయ్య నేతృత్వంలో ఈ పురజన సంఘం ఏర్పాటైంది. అన్ని కులాలు, వర్గాలకు చెందిన వారు సభ్యులుగా ఉండడంతో పురజన సంఘంగా నామకరణం చేశారు. సిరిసిల్ల పట్టణంలో మూడో వినాయక ఉత్సవ మంటపంగా నమోదైన ఈ సంఘంలో 115 మంది సభ్యులు ఉన్నారు. చందాలు వసూలు చేయకుండా.. సంఘానికి చెందిన ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయంతోనే ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేకత అని సంఘం అధ్యక్షుడు ఆడెపు సత్యనారాయణ, కౌన్సిలర్ కల్లూరి రాజు తెలిపారు.

అర్జీలు త్వరగా పరిష్కరించండి

- కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణి అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడారు. రెవెన్యూ శాఖ 70, సిరిసిల్ల మున్సిపల్ 7, ఎన్డీసీ 4, ఉపాధి కల్పన 4, డీపీవో కార్యాలయం 4, వ్యవసాయశాఖ 3, డీడబ్ల్యూవో 3, డీఎస్సీడీవో 2, సెస్ 2, డీబీసీడీవో, ఈడీఎం, ఎక్సైజ్, హ్యాండ్లూమ్స్, డీసీఎస్‌వో, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, బోయినపల్లి, ఎంపీడీవో కార్యాలయాలకు ఒక్కటి చొప్పున 97 దరఖాస్తులు వచ్చాయి. వాటిని సంబంధిత అధికారుల బదిలీ చేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

పింఛన్ ఇప్పించండి



మాది సిరిసిల్లలోని గీతానగర్. రోడ్డు ప్రమాదంలో నా కాలు విరిగింది. నేను సరిగ్గా నడువలేను. ఎలాంటి ఆస్తిపాస్తులు కూడా లేవు. నాకు పింఛన్, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పించండి.

– చింతల బాబు, సిరిసిల్ల

ఇంటి నిర్మాణానికి సహాయం చేయండి



మాది వేములవాడ. చిన్నరేకుల షెడ్డులో ఉంటున్నాం. వర్షాలకు కూలిపోయేటట్టు ఉంది. నేను ఫుట్‌పాత్‌పైన దారాలు అమ్ముతూ జీవిస్తున్నాను. నాకు వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి సహాయం అందించండి.

– మురంశెట్టి వినయ్‌కుమార్, వేములవాడ

బ్యాక్‌వాటర్ రాకుండా చర్యలు చేపట్టాలి



మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ రాకుండా చర్యలు తీసుకోవాలి. ఏటా కరకట్ట బ్యాక్‌వాటర్‌తో వర్షపునీరు, డ్రైనేజీ నీరు మా పట్టా భూముల్లోకి రావడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. – అన్నారపు కనకయ్య, భూలక్ష్మి, కిరణ్‌కుమార్, లచ్చయ్య

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి



సిరిసిల్లలోని కొత్తచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చెరువు నాలాలు కబ్జా కావడంతో బస్టాండ్, సంజీవయ్యనగర్, శాంతినగర్, రాళ్లబావి, ఆటోనగర్, శ్రీనగర్ కాలనీలు చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్నాయి. చెరువుల రక్షణకు అక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– సోమిశెట్టి దశరథం, ఏఐఎఫ్‌టీయూ నాయకుడు

పౌష్టికాహార లోపం రానీయొద్దు

సిరిసిల్లటౌన్: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమీక్షించారు. పోషణలోపంతో ఒక్కరూ బాధపడకుండా చూడాలన్నారు. పోషణమాసంలో చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అందిస్తున్న సేవలు తెలుసుకున్నారు. ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌ను సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రసూతి మరణాలు కాకుండా చూడాలన్నారు. రాబోయే శనివారం ఎనీమియా టెస్టు, ట్రీట్‌టాక్ కార్యక్రమం చేపట్టాలన్నారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీడీపీవోలు సౌందర్య, సబిత, ఏసీడీపీవోలు సుచరిత, జ్యోతి ఉన్నారు.

మిడ్‌మానేరులో 23 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం 23.03 టీఎంసీలకు చేరింది. సోమవారం ఎల్‌ఎండీకి 10,400 క్యూసెక్కులు, అనంతగిరి ప్యాకేజీ–10కి 6,400 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరదకాల్వ మీదుగా 13,400, మరో 2,525 క్యూసెక్కుల మేర వరద వస్తోంది.



క్లుప్తంగా

దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలి



సిరిసిల్లటౌన్: దేశవ్యాప్తంగా దివ్యాంగుల హక్కు చట్టం–2016ను అమలు చేయాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆకుల సంధ్య కోరారు. సిరిసిల్లలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు అనుకున్న రీతిలో దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయకపోవడంతోనే ఇప్పటికీ సమాజంలో అవమానాలు ఎదర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్, బోగ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు హక్కులను సాధించుకుందాం

- భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు నారాయణరెడ్డి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతుల హక్కులను ఐకమత్యంతో సాధించుకుందామని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మ నారాయణరెడ్డి, కార్యదర్శి ద్యాప దేవయ్య కోరారు. ఎల్లారెడ్డిపేటలోని సద్దిమద్దుల రెడ్డి సంక్షేమ సంఘంలో సోమవారం రైతు దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి పాటుపడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ మండల కార్యవర్గాన్ని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. రైతు ప్రతినిధులు సద్ది లక్ష్మారెడ్డి, గుండాడి వెంకటరెడ్డి, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, మద్దుల పద్మారెడ్డి, మద్దుల శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డీజేలకు అనుమతి లేదు

- డీఎస్పీ చంద్రశేఖర్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వినాయక నవరాత్రుల సందర్భంగా మండపాల వద్ద, నిమజ్జన వేడుకల్లో డీజేలకు అనుమతి లేదని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులతో సోమవారం మండల కేంద్రంలో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. ఒకే రోజు నిమజ్జనం జరిగేలా చూసుకోవాలన్నారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయండి



ఇల్లంతకుంట(మానకొండూర్): విద్యార్థినులు లైంగిక వేధింపులు ఎదుర్కొంటే వెంటనే ఫిర్యాదు చేయాలని షీటీమ్స్ సభ్యులు తెలిపారు. ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీటీమ్ సభ్యులు మాట్లాడుతూ ఆకతాయిల వేధింపులు ఉంటే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. షీటీమ్ సభ్యులు అక్కడికి చేరుకొని ఆకతాయిల పని పడతారన్నారు. సోషల్‌మీడియాలో వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దని సూచించారు. ఆపదలో ఉన్నప్పుడు 87126 56425 నంబర్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం పాల్గొన్నారు.

పనిముట్లు భారమాయే!

- చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బందులు
- ఆరేళ్లుగా నిలిచిపోయిన సబ్సిడీ
- జిల్లాలో 1.29 లక్షల మంది రైతులు
- 2.82లక్షల ఎకరాల పంట భూములు



కేజ్‌వీల్స్



నాట్లకు పొలం సిద్ధం చేస్తున్న రైతు



ఇతను ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెకు చెందిన అల్లాడి ఇస్తారి. వరిపంట సాగు చేస్తున్నాడు. సొంతంగా ట్రాక్టర్ ఉంది. కేజీవీల్స్‌ను సిద్దిపేటలో ఓ వెల్డింగ్ కంపెనీలో రూ.45వేలు వెచ్చించి కొనుగోలు చేశాడు. పవర్ స్ప్రేయర్లు, రొటోవేటర్లు కొనుగోలు చేశాడు. ఆరేళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నాగళ్లు, కేజీవీల్స్ ఇప్పుడు కూడా ఇస్తే బాగుండేదని ఇస్తారి అభిప్రాయపడుతున్నాడు. తమ లాంటి వ్యవసాయాధారిత కుటుంబాలకు సబ్సిడీపై పనిముట్లు ఇస్తే ఎంతో ఉపయోగం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాడు.

ముస్తాబాద్(సిరిసిల్ల): సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన పనిముట్లపై సబ్సిడీని ఆరేళ్లుగా అమలు చేయడం లేదు. ఫలితంగా వ్యవసాయ పనుల్లో రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్ నాగళ్లు, కేజీవీల్స్, మూడు, నాలుగు పళ్ల నాగళ్లు, రొటోవేటర్లు, స్ప్రేయర్లు, పవర్‌టిల్లర్లపై సబ్సిడీ అందక రైతులపై ఆర్థికంగా భారం పడుతుంది. ఆరేళ్లుగా యాంత్రీకరణను అధికారులు మరిచిపోయారు. రైతుబంధు, పంటరుణమాఫీతో రైతులకు అండగా ఉంటున్నామంటున్న ప్రభుత్వాలు సాగులో ఉపయోగపడే పనిముట్లపై సబ్సిడీలను ఎత్తివేయడంతో పంటలు పండించే రైతులు వాటిని కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2.82లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తున్నారు. వీరికి 2018 నుంచి వ్యవసాయ యాంత్రీకరణ అటకెక్కింది. దీంతో పనిముట్ల కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అద్దె యంత్రాలతో అన్నదాతలకు భారం

దుక్కి దున్నిన దగ్గర నుంచి విత్తనాలు విత్తి.. పంట చేతికొచ్చే వరకు కూలీలు దండిగానే కావాలి. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, డ్రమ్‌సీడర్లు రంగంలోకి దిగాయి. కూలీల అవసరం తగ్గింది. ఒక ఎకరానికి వరినాట్లు వేయాలంటే రూ.15వేల వరకు ఖర్చు అవుతుంది. ఎద్దుల వినియోగం తగ్గి ట్రాక్టర్లతో దున్నడం, రొటోవేటర్లతో చదును చేస్తున్నారు. అలాగే పంట కోతకు గంటకు రూ.3500 ఖర్చు అవుతుంది. దీంతో రైతులు అద్దెలు చెల్లించలేక, వచ్చిన దిగుబడి పెట్టుబడికే అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఎకరంలో వరిపంట దుక్కి దున్నడం, నాటు వేయడం, కోతల వరకు రూ.25వేలు అవుతోంది. రైతులకే ట్రాక్టర్లు, పవర్‌టిల్లర్లు, స్ప్రేయర్లు కనుక ఇచ్చినట్లైతే ఖర్చులు మిగులుతాయని పేర్కొంటున్నారు.

సబ్సిడీ ఇలా..

ప్రభుత్వం గతంలో 50 నుంచి 60 శాతం సబ్సిడీతో రైతులకు పనిముట్లు అందజేసేది. కేజీవీల్స్, మూడు, నాలుగు పళ్ల నాగళ్లు, రొటోవేటర్లు, స్ప్రేయర్లు, పవర్‌టిల్లర్లు, హార్వెస్టర్లు అందించేది. గత ప్రభుత్వం రైతుబంధు అమలు చేయడంతో సబ్సిడీ యంత్రాల పంపిణీని నిలిపివేసింది. ఈ నేపథ్యంలో వచ్చిన కొత్త ప్రభుత్వం రుణమాఫీ చేపట్టగా, గతంలో కాంగ్రెస్ అందించిన సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు తిరిగి ప్రవేశపెడుతుందనే ఆశలో రైతులు ఉన్నారు. రైతులు రూ.45వేలు వెచ్చించి వెల్డింగ్ దుకాణాల్లో కేజీవీల్స్ ప్రత్యేకంగా చేయించుకుంటున్నారు. అలాగే రొటోవేటర్లు రూ.60వేలు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయానికి అద్దె భారం అవుతుండగా, వ్యవసాయ పనిముట్లకు సైతం భారీగా పెట్టుబడులు పెడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీ పనిముట్లకు నిధులు రాలేదు

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించేందుకు ఎలాంటి నిధులు మంజూరుకాలేదు. ప్రస్తుతానికి రైతు రుణమాఫీపై కసరత్తు చేస్తున్నాం. సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు అందించాలనే ఆదేశాలు ఇప్పటి వరకు రాలేదు. సబ్సిడీ పనిముట్లు వస్తే రైతులందరికి సమాచారం అందిస్తాం.

– అఫ్జల్ బేగం, జిల్లా వ్యవసాయాధికారి

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రైతు మృతి

- అవయవాలు దానం
- మృతుడు తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు నాగరాజు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందుండి పోరాడిన నాగరాజుకు కన్నీటితో వీడ్కోలు పలికారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. రాచర్లగొల్లపల్లికి చెందిన మారెల్లి నాగరాజు(39) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. తాను పెంచుకుంటున్న గేదె రోడ్డు దాటుతుండగా.. వేగంగా గొల్లపల్లి వైపు వెళ్తున్న ఆటో వచ్చి ఢీకొట్టింది. గేదెను తాడుతో తన చేతులకు కట్టుకోగా.. ఆ తాడుతో నాగరాజు దూరంగా ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. తీవ్రంగా రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. నాగరాజును మొదట స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు తలకు శస్త్రచికిత్స చేశారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి కోమాలోనే ఉన్న నాగరాజు చివరికి సోమవారం తెల్లవారుజామున ప్రాణాలు వదిలాడు. నాగరాజు కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఆస్పత్రిలోనే అతని అవయవాలను దానం చేశారు. నాగరాజు పాడెను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, తెలంగాణ ఉద్యమకారులు మోసి అంతిమ వీడ్కోలు పలికారు. మృతునికి భార్య వసుధ, కుమారుడు శివ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.



నాగరాజు పాడె మోస్తున్న తోట ఆగయ్య, తెలంగాణ ఉద్యమకారులు



నాగరాజు (ఫైల్)

చనిపోతూ ఐదుగురికి ప్రాణదానం

బతికి ఉన్నప్పుడు విద్యార్థుల్లో జ్ఞానజ్యోతులు వెలిగించిన ప్రైవేట్ టీచర్ మారెల్లి నాగరాజు... చనిపోయాక కూడా మరో ఐదుగురికి ప్రాణదానం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నాగరాజు బ్రెయిన్ డెత్ చెందగా వైద్యుల సూచనలతో అతడి కుటుంబ సభ్యులు అవయవాలను దానం చేశారు. నాగరాజు స్థానికంగా ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తుండేవాడు. ఇటీవల తన సొంత స్థలంలో డెయిరీ పెట్టుకొని జీవిస్తున్నాడు. ఈక్రమంలోనే జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కోమాలోకి వెళ్లాడు. బ్రెయిన్ డెత్‌గా వైద్యులు తెలిపారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు అతడి అవయవాలను ఐదుగురికి దానం చేశారు. కొన్నేళ్ల క్రితమే నాగరాజు తండ్రి చనిపోగా.. తల్లి మానసికంగా కుంగుబాటుకు గురైంది. ఇప్పుడు ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ తల్లి ఒంటరైంది. కాగా, అందరితో కలిసి మెలిసి ఉండే నాగరాజు మృతితో ఎల్లారెడ్డిపేట మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నాగరాజుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ స్థానిక విద్యావేత్తలు, విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆయన అంతిమయాత్రలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న మండల ప్రజలు నాగరాజు అంతిమయాత్రలో పాల్గొని నివాళి అర్పించారు.

10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ బియ్యంతో పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్ శివారులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆటోలో తరలిస్తున్న 10 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. నామాపూర్‌కు చెందిన గట్టయ్య ఆటోలో బియ్యం తరలిస్తుండగా పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీస్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల జిల్లా మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈమేరకు కలెక్టర్‌కు సమ్మెనోటీస్ అందించారు. వారు మాట్లాడుతూ వంటకార్మికుల సమస్యలపై ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించిన పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దసరా పండుగలోపు సమస్యలు పరిష్కరించకుంటే అక్టోబర్ 14 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని నోటీసులు ఇచ్చారు. ఏఐటీయూసీ నాయకులు మీసం లక్ష్మణ్, కదారి రాములు, లక్ష్మి, సరోజన, రాజవ్వ పాల్గొన్నారు.





కోడెమొక్కు చెల్లించుకుంటున్న విప్ లక్ష్మణ్‌కుమార్, కామారెడ్డి ఎమ్మెల్యేకు ప్రసాదాలు అందిస్తున్న అధికారులు

రాజన్న సేవలో ప్రముఖులు

వేములవాడ: రాజన్నను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

గోడ తడిచి చిన్నారికి విద్యుత్‌షాక్

- కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూంలో ఘటన
- తల్లిదండ్రుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో సోమవారం ఓ చిన్నారి విద్యుత్‌షాక్‌కు గురికాగా ప్రాణాపాయం తప్పింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. కేసీఆర్‌నగర్ బ్లాక్ నంబర్ 90లో నివసిస్తున్న కొలిపాక రాము–రూప దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు ఏడేళ్ల వయసున్న లాస్య సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లేందుకు తయారై ఇంటి ఆవరణలో గొడపక్కన విడిచిన చెప్పులు వేసుకునేందుకు గోడను ముట్టుకుంది. అదే గోడకు కరెంటు మీటర్లు అమర్చి ఉండడం.. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిపోవడంతో చిన్నారి విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన సమీపంలో ఉన్న మమత అనే మహిళ పాపను రక్షించేందుకు ప్రయత్నించగా ఆమె సైతం విద్యుత్‌షాక్‌కు గురైంది. ఇద్దరిని రక్షించేందుకు వచ్చిన చిన్నారి తల్లి రూపకు కూడా షాక్ రావడంతో సమయస్ఫూర్తితో వ్యవహరించి కర్ర సాయంతో చిన్నారిని పక్కకులాగి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం ఏమి లేదని వైద్యులు తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి లాస్య

మోసం చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు

చందుర్తి(వేములవాడ): జర్నలిస్టు కోటాలో ఇల్లు మంజూరు చేయిస్తానని, అక్రిడిటేషన్‌కార్డు, గుర్తింపుకార్డు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు వసూలుకు పాల్పడి మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన రొండి చంద్రయ్యకు అదే గ్రామానికి చెందిన పీసరి శ్రీనివాస్ అనే వ్యక్తి వేములవాడ అర్బన్ మండలం చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన చొక్కాల వనజను పరిచయం చేశాడు. వనజ శుభోదయ కమ్యూనికేషన్‌లో కరస్పాండెంట్ రిపోర్టర్‌గా పనిచేస్తుందని తెలిపాడు. రిపోర్టర్‌గా గుర్తింపుకార్డుతోపాటు ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ ఇప్పిస్తానని చెప్పి ఫోన్‌పే, చెక్కుల రూపంలో రూ.16లక్షలు వసూలు చేసింది. అంతేకాకుండా రామన్నపేటకు చెందిన ఆది మల్లయ్యకు పరంపోగు స్థలానికి పట్టా ఇప్పిస్తానంటే మధ్యవర్తిగా ఉండి రూ.10లక్షలు చంద్రయ్య ఇప్పించాడు. రిపోర్టర్‌గా అవకాశం ఇవ్వకపోగా, ఇల్లు కూడా మంజూరుకాకపోవడంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని చంద్రయ్య పలుమార్లు వనజను కోరాడు. డబ్బులు అడిగితే బూతులు తిడుతూ, కులం పేరుతో దూషిస్తుందని బాధితుడు రొండి చంద్రయ్య ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై చీటింగ్ కేసుతోపాటు కులం పేరుతో దూషించిన కేసులు నమోదు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు వివరించారు.

గురుకులాలు తనిఖీ చేయండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- 21 మంది ప్రత్యేకాధికారుల నియామకం

సిరిసిల్లటౌన్: జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను తనిఖీ చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్య, మౌలిక వసతులు, తదితర అంశాల పరిశీలనకు కొత్తగా 21 మంది ప్రత్యేకాధికారులను నియమిస్తూ సోమవారం కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఈ ప్రత్యేకాధికారులు విద్యాలయాలను తనిఖీ చేయడంతోపాటు ప్రతీ నెలలో ఒక రోజు రాత్రి బసచేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, సదుపాయాల గురించి తనిఖీ చేసిన అనంతరం నోడల్ అధికారి, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌కు నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆటో, కారు ఢీ



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో



ప్రమాదానికి కారణమైన కారు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

రుద్రంగి(వేములవాడ): రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి రుద్రంగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపిన వివరాలు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన నారవేని విజయ్ కుటుంబ సభ్యులతో కలిసి రుద్రంగి నుంచి వేములవాడ వైపునకు ఆటోలో వెళ్తున్నాడు. రుద్రంగి మండల కేంద్రానికే చెందిన కునుసోత్ కిరణ్‌కుమార్ అనే వ్యక్తి కారులో వేములవాడ నుంచి రుద్రంగికి వస్తూ ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నారవేని విజయ్, జల, రిషిలకు తీవ్ర గాయాలయ్యాయి. రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను స్థానికుల సహాయంతో వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జీనియస్ బుక్‌లోకి శ్రీనివాస్

సిరిసిల్లకల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం పూర్వ కార్యనిర్వహణ అధికారి నాగారపు శ్రీనివాస్ జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుదక్కించుకున్నారు. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో సోమవారం నిర్వహించిన జనకళ వేములవాడ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేశారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, మాజీ న్యాయమూర్తి బూరుగుల మధుసూధన్, డాక్టర్ కె.కోటేశ్వరరావు, కోఆర్డినేటర్ డాక్టర్ జవ్వాజి అంజయ్యగౌడ్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న నాగారపు శ్రీనివాస్

విదేశీ విద్య స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎస్సీ విద్యార్థుల కోసం 2024–25 సంవత్సరానికి ప్రవేశపెట్టిన జాతీయ విదేశీ విద్య ఉపకార వేతనానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నాగైశ్వర్ ప్రకటనలో తెలిపారు. ఈ పథకంతో విదేశాల్లో పీజీ, పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం ఉంటుందని, జిల్లా నుంచి 125 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. www.nosmsje.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయసు ఏప్రిల్ 1 నాటికి 35 ఏళ్లు మించకూడదని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.8లక్షల్లోపు ఉండాలని తెలిపారు. డిగ్రీలో 60 శాతం ఉత్తీర్ణత ఉండాలని తెలిపారు. వివరాలకు 97040 11827లో సంప్రదించాలని సూచించారు.